క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన కొలువు దీరిన లక్ష్మీనృసింహ స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం కావడంతో ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని వివిధ రకాలపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటలకు ఆలయానికి చేరుకుని క్యూలో ఉన్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

కొత్త రేషన్‌కార్డుల అందజేత



అంపిలిలో అర్హులకు కొత్త రేషన్‌కార్డులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్‌: మండలంలోని అంపిలి గ్రామంలో గురువారం కొత్త రేషన్‌ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల సురక్ష కార్యక్రమంలో గ్రామస్తులు అందించిన అర్జీలపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టడంతో 14 మందికి నూతన కార్డులు మంజూరైనట్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు తెలిపారు. వైస్‌ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్‌తో కలసి లబ్ధిదారులకు నూతన బియ్యం కార్డులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకుడు చింత సంగంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వండువలో ఆధ్యాత్మిక శోభ



పూజలందుకున్న సాయిబాబా

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామంలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో వెలిసిన షిర్డీసాయి ధ్యాన మందిరంలో భక్తులు ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి నామస్మరణతో పూజలు చేశారు. ఉదయం కాగడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు సాయినాధునికి పాలాభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో మహానారాయణ సేవ కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వీరఘట్టం తెలగవీధిలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌.వి.ఎల్‌.ఎన్‌ శర్మయాజి ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

మున్సిపల్‌ కార్మికుల ఆందోళన



ర్యాలీ చేస్తున్న మున్సిపల్‌ కార్మికులు

పాలకొండ: మున్సిపల్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. పట్టణంలో మున్సిపల్‌ కార్మికులు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ ఎదుట మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్‌ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. పాలకొండ పట్టణం విస్తరించిన కారణంగా ఆ మేరకు కార్మికులను నియమించాలని కోరారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని, కరోనా కాలంలో సేవలు అందించిన కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సురేష్‌, శ్రీదేవి, విమల, రఘు పాల్గొన్నారు.

రక్త పరీక్షలకు ఆధునిక యంత్రం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్త పరీక్షలకు ఆధునిక యంత్రాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ఫుల్లీ ఆటో ఎనలైజర్‌ పేరుతో పిలవబడే ఈ రక్త పరీక్షల యంత్రం ద్వారా గంటలో 640 వివిధ రక్త పరీక్షలను చేయవచ్చని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ బి.శ్రీనివాసరావు తెలిపారు. దీన్ని గురువారం ప్రారంభించామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవల కోసమే దీన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.

చంద్రయాన్‌–3పై హర్షం



బలిజిపేట: ర్యాలీ చేస్తున్న పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థులు



ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నోబుల్‌ వాకర్స్‌ క్లబ్‌ సభ్యులు



100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



చంద్రయాన్‌-3 నమూనాతో ఇస్రోకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రైవేట్‌ పాఠశాల విద్యార్థులు

పార్వతీపురంటౌన్‌: చంద్రుడి దక్షిణ ధృవంపై మన దేశస్తులు అడుపెట్టడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, చంద్రయాన్‌3 విజయం పట్ల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇంటా, బయటా ఎక్కడ చూసినా చంద్రయాన్‌–3 గురించే ఉత్కంఠభరితంగా ఎదురుచూశారు. గురువారం పార్వతీపురం పట్టణంలో చంద్రయాన్‌–3 విజయోత్సవ ర్యాలీలు దర్శనమిచ్చాయి. చంద్రుని దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలిదేశంగా భారతదేశం రికార్డులు సృష్టించడంతో ప్రజల ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి.

జయహో భారత్‌

బలిజిపేట: చంద్రయాన్‌–3 విజయవంతం అవడంతో సంబరాలు మిన్నంటాయి. అందులో భాగంగా మండలంలోని పెదపెంకి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. భారత్‌ మరిన్ని విజయాలు సాధించాలని, చంద్రుని దక్షిణ ధృవంపై అన్ని దేశాల కంటే ముందుగా భారత్‌ అడుగు పెట్టిందని, దేశానికి ఇటువంటి స్ఫూర్తిదాయకమైన విజయాలను ఇస్రో అందించాలనే నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్‌ సభ్యులు

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



ప్రైవేట్‌ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్‌: ప్రైవేట్‌ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి (డీఐఓ) డాక్టర్‌ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని పలు ప్రైవేట్‌ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్‌ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియకు సంబంధించి రికార్డులను పరిశీలించి గడువులోగా రెన్యువల్‌ చేసుకోవాలని సూచించారు. రిషెప్షన్‌, పేషెంట్లు వేచి ఉండే గదిని పరిశీలించారు. అనంతరం రక్తపరీక్షలు, వాటి రికార్డులు, వైద్యపరికరాలు, ఫార్మసీ, బయోమెడికల్‌ వ్యర్థాలను అమలు చేస్తున్న తీరును పరీక్షించి వాటి నిర్వహణపై ఆరాతీశారు. నోటిఫైడ్‌ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గన్యాలను గుర్తిస్తే ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో నమోదు చేసి జిల్లా ఆరోగ్య కేంద్రానికి తెలియజేయాలని ఆదేశించారు. రోగుల వివరాలు రికార్డుల్లో స్పష్టంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలను సూచించే పోస్టర్లను విధిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. వివిధ ఆరోగ్య పరీక్షలకు రోగులు చెల్లించాల్సిన రుసుముల పట్టిక ఆస్పత్రిలో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌ వై.యోగేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంగవలో పశు వైద్య శిబిరం



మేకకు వ్యాక్సిన్‌ వేస్తున్న పశువైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెంగవ గ్రామంలో గురువారం జట్టు – మాతోట జీవా ప్రాజెక్ట్‌ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని అనారోగ్యం బారిన పడిన పశువులను గుర్తించి అవసరమైన వ్యాక్సిన్లను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యంగా ఈ సీజన్లో పశువులకు జబ్బవాపు, గొంతువాపు, ముద్ద చర్మ వ్యాధులు, గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి, మూతిపుండ్లు, ముసరా వ్యాధులు, కోళ్లకు కొక్కెర వ్యాధి, మశూచి, క్షయ, బెరిబెరి, కండ్ల కలక వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పశువులకు ఈ వ్యాధులు వచ్చినట్లు గుర్తించినట్లయితే తక్షణమే తమ సిబ్బందిని సంప్రదించి వైద్య సేవలు అందివ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌ జి.ప్రభోద్‌, జట్టు కో ఆర్డినేటర్‌ జి.మురళి, వెటర్నరీ అసిస్టెంట్లు ఎం.నవీన్‌, పి.నవీన్‌, టి.రామరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన సెర్ప్‌ ఉద్యోగులు



ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెర్ప్‌ ఉద్యోగులు

జియ్యమ్మవలస: సెర్ప్‌ ఉద్యోగస్తులకు 23 శాతం జీతం పెంచడంతో వైఎస్సార్‌ క్రాంతి పథం ఉద్యోగులు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి తన నివాసంలో గురువారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తమకు చేసిన మేలుకు జీవితాంతం రుణపడి ఉంటామని సెర్ప్‌ ఉద్యోగుల యూనియన్‌ లీడర్‌ ఈవీ కిశోర్‌, ఉద్యోగులు అన్నారు.

భామినిలో ట్రైనీ ఐఏఎస్‌ల విడిది



ట్రైనీ ఐఏఎస్‌లకు వసతి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పీఓ కల్పనాకుమారి

భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన జీవన విధానంపై అధ్యయనం చేయడానికి రానున్న ట్రైనీ ఐఏఎస్‌ల బృందం భామినిలో విడిది చేయనుంది. ఈ నెల 27న రానున్న శిక్షణలోని14 మంది ట్రైనీ ఐఏఎస్‌లకు చేస్తున్న వసతి ఏర్పాట్లును సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్‌ అధికారి కె.కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. భామినిలో నిర్మాణం సాగుతున్న ఏకలవ్య మోడల్‌ స్కూల్‌ భవనాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలను పరిశీలించారు. టీడబ్ల్యూఆర్‌ స్కూల్‌ భవనాలను విడిదికి అనుకూలంగా గుర్తించారు. శిక్షణలోని 14 మంది ఐఏఎస్‌లు బృందంలో 9మంది పురుషులు, 5గురు మహిళలు ఉన్నారు. వీరు రెండు బృందాలుగా వారం రోజులు పాటు భామిని మండలం బొడ్డగూడ, సీతంపేట మండలం పూతికవలసలలో పర్యటించి గిరిజన జీవన విధానాలు గుర్తిస్తారని పీఓ కల్పనాకుమారి తెలిపారు. ఈ బృందాలకు లైజినింగ్‌ అధికారులుగా సీతంపేట ఏటీడబ్ల్యూఓ మంగవేణి, పీఎమ్మార్సీ ఏఎంఓ కోటిబాబులు వ్యవహరించనున్నారు. వీరంతా గిరిజనుల ఆర్థిక సామాజిక స్థితిగతులు, సంస్కృతి సాంప్రదాయాలపై అధ్యయనం చేస్తారు. గిరిజన గ్రామాల్లో అమలు చేస్తున్న భూ సంస్కరణలు, పీసా చట్టం అమలు, వ్యవసాయ విధానాలు తెలుసుకుంటారు. గిరిజన కళలు, ఉపాధి కల్పన, విద్యా విధానాలు, ఆరోగ్య పరిస్థితులు అధ్యయనం చేస్తారు. ఐటీడీఏ పీఓ వెంట డీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్‌ నీలాపు అప్పారావు, ఏఎంఓ కోటిబాబు, ఏఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రరావు ఉన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించాలి

వీరఘట్టం: దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను గుర్తించాలని పాలకొండ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌.విజయకుమారి సూచించారు. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు గురువారం నిర్వహించిన ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. రన్నింగ్‌, బేస్‌బాల్‌, షార్ట్‌ పుట్‌, స్లో వాక్‌, డిస్కస్‌ త్రో తదితర ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు డీవైఈఓ విజయకుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఆర్‌.ఆనందరావు, ఐఈఆర్‌టీ ఆర్‌.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శిర్లాపు ఉమామహేశ్వరరావు, సైల పద్మరాజు, ఐ.గంగాధర్‌ తదిరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- డీసీహెచ్‌ఎస్‌ వాగ్దేవి



భద్రగిరి సీహెచ్‌సీలో ఇన్‌పేషంట్ల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్‌ వాగ్దేవి

గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్‌ బి.వాగ్దేవి అన్నారు. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు ఇన్‌పేషంట్లతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ల్యాబ్‌ను సందర్శించి చేపడుతున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం వైరల్‌ ఫీవర్స్‌ ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. దోమల నివారణ కోసం ప్రస్తుతం కొనసాగుతున్న రెండో విడత ఏసీఎం 5 శాతం మందు పిచికారీ కార్యక్రమం ఈ నెలాఖరుకు పూర్తవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 17 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. డెంగీ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో వైద్యులు, స్పెషలిస్ట్‌ వైద్యుల కొరతతో పాటు, మందుల కొరత కూడా లేదన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయని, దాదాపు 80 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల ప్రసవాల జాబితాలో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. వైఎస్సార్‌ ఆరోగ్య శ్రీ వైద్యసేవలు పొందడంలో కూడా జిల్లా ముందంజలో ఉందన్నారు. ఆమె వెంట స్థానిక వైద్యులు ఉన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఓ వరం..

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఇచ్చిన మాట ప్రకారం సాలూరు నియోజకవర్గంలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు గిరిజన విద్యార్థులకు వరమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వర్సిటీ శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌రెడ్డికి గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద యూనివర్సిటీ శంకుస్థాపన, మరడాం సమీపంలో ముఖ్యమంత్రి సభాస్థలి ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజనులకు అందుబాటులో యూనివర్సిటీ ఉండాలని ముఖ్యమంత్రి జగనన్న కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సాలూరులో ఏర్పాటు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీని గిరిజనేతర ప్రాంతమైన కొత్తవలస వద్ద రెల్లకు తరలించి, రియల్‌ఎస్టేట్‌కు తెరలేపారని ఆరోపించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు న్యాయం చేయలేని వారు ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్‌ మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనుల కోసం ప్రాథమిక పాఠశాలలు, సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, స్కూల్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌లు, ఏకలవ్య పాఠశాలలు సుమారు 2,705 విద్యాలయాలు నడుస్తున్నాయని తెలిపారు. యూనివర్సిటీ ఏర్పాటైతే గిరిజనులు అధికంగా ఉన్న ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌, మధ్యప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన గిరిజనులు, గిరిజనేతరులకు ఎంతో సదుపాయంగా ఉంటుందన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆటలపోటీలు



స్లోవాక్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌

మక్కువ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష – పార్వతీపురం మన్యం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌, హెచ్‌ఎం హేమలత పోటీలను ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పోటీల్లో పాల్గొనగా.. సాఫ్ట్‌బాల్‌, స్లోవాక్‌, షాట్‌పుట్‌, ఖోఖో, తదితర పోటీలను నిర్వహించారు. మండలస్థాయి విజేతలు ఈనెల 29న పార్వతీపురంలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌. శంకరరావు, ఐఈఆర్‌పీ శైలజ, పీఈటీలు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్‌ ఆడుతున్న దివ్యాంగురాలు

వరి పొలంలో కాలి బాటలు వేసుకోవాలి



వెంకటాపురంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ ఎస్‌.అవినాష్‌

సీతానగరం: వరి చేను ఏపుగా పెరుగుతున్న సమయంలో తెగుళ్ల నివారణకు, పిలకలు ఎక్కువగా పెట్టడానికి వరిచేనుకు గాలి వెలుతురు తగిలేవిధంగా కాలిబాటలు రైతులు వేయాలని ఏఓ ఎస్‌.అవినాష్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కె.వెంకటాపురంలో సర్పంచ్‌ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులకు వైఎస్సార్‌ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిచేలు పెరుగుతున్న సమయంలో చేనుకు గాలి, వెలుతురు తగిలినపుడే తెగుల్లు నివారించడానికి అవకాశముంటుందన్నా రు. అలాగే యాంత్రీకరణ విధానంలో వరినాట్లు వేసిన పొలం, సాధారణ పద్ధతిలో నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. సాధారణ పద్ధతిలో కంటే యాంత్రీకరణ పద్ధతిలో నాట్లు వేసిన పొలంలో కుదుళ్ల(పిలకలు) ఉండడంపై రైతులకు వివరించారు. ఎక్కువ కుదుళ్లు ఉండడం వల్ల మొక్కలకు గాలి వెలుతురు సరిగా తగలక ఎక్కువగా పీక పురుగు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి పొలంలో తగినదూరం ఉండేలా నాట్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లంక సూరి సుబ్రహ్మణ్యం, బుడితి ముకుందరావు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలకు డిమాండ్‌



తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం పంచాయతీలో ఇంతవరకు రేషన్‌ సరుకులు ఇవ్వలేదంటూ సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీతారాం మాట్లాడుతూ గడసింగుపురం పంచాయతీలోని ఏనుగుల గూడ గిరిజనులకు ఇంతవరకూ బియ్యం ఇవ్వక పోవడం వలన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏనుగుల గూడతో పాటు బూరిరామినాయుడువలస గ్రామానికి కూడా సరుకులు అందడం లేదన్నారు. సరుకులు సక్రమంగా ఇవ్వని డీలర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. మండల కమిటీ సభ్యులు ఎ.రామారావు పాల్గొన్నారు.